# మహారాజశ్రీ మనవలు

**చ**లపతి పొద్దున్నే లేచి ఆఫీసు ఫైల్స్ చూసుకున్నాడు. సెలవురోజుల్లో కూడా ఆఫీసు పని యింట్లోనే చేసుకుంటాడు. చిన్నప్పట్నుంచీ చాలా సిన్సియర్!

ఆరోజు ఆదివారం.

టి.వి.లో పొద్దున్న ఎనిమిది గంటలకి "గుండమ్మకథ" సినిమా చూడాలని అతని కోరిక. టిఫిన్ చేసి ఎనిమిది గంటలకే రెడీ అయ్యాడు, సినిమా చూద్దామని. అదే టైమ్‌కి వనస్థలిపురంలో ఉన్న తన పెద్దకూతురు వచ్చి, వాళ్ళు ఏదో పెళ్ళికి వెళ్ళాలని చెప్పి, తన కొడుకుని తీసుకొచ్చి వదిలేసి వెళ్ళింది.

'గోవిందా! యింక సినిమా ఏం చూస్తాం! వీడు యిక, కార్టూన్లు చూడడం మొదలుపెడతాడు!' అనుకున్నాడు చలపతి.

చలపతిది చాలా స్వచ్ఛమైన మనసు. అనుకున్నట్లుగానే మనవడు కార్టూన్లు చూడ్డం మొదలుపెట్టాడు. వాడికి 'చీటోస్', 'అంకుల్ చిప్స్' అంటే చాలాయిష్టం. డబ్బులు పోతే పోయాయి అని, లోపల అనుకుని "చీటోస్" కొని ఇస్తాను, అవి తిని, బయట ఆడుకో! అన్నాడు, మనవడుతో చలపతి.

"మరి అంకుల్ చిప్సో!" అన్నాడు తెలివైన మనవడు.

"అవి మీ మామయ్య హైదరాబాద్ వచ్చినప్పుడు కొనిస్తాడు. నువ్వు ఇంగ్లీషు మీడియం కదా 'అంకుల్'ని అడగాలి" అన్నాడు చలపతి.

"సరే! చీటోస్‌తో బోణీకొడదాం!" అని, తెప్పించుకున్నాడు వాడు.

సినిమా మొదలయింది. మొదలైన అరగంటకి, మనవడు యింట్లోకి వచ్చి 'తాతా! చీటోస్ అయిపోయాయి' అన్నాడు.

"కాసేపు కార్టూన్ చూస్తా"నన్నాడు వాడు. "ఉండరా సినిమా చూస్తాను నేను' అన్నాడు చలపతి.

ఈ లోపులో, టివీలో అంకుల్ చిప్స్ ఎడ్వర్‌టైజ్‌మెంట్ వచ్చింది.

"అంకుల్ వచ్చేసరికి చిప్స్ నిల్వ ఉండి, పాడైపోతాయేమో, నువ్వే కొనియ్యి

తాతా!" అన్నాడు. సరే అని అంకుల్ చిప్స్ కూడా కొనిచ్చాడు, చలపతి. మనవడు అవి కూడా ఊదేసాడు.

"పోనీండి! ఈ పాత సినిమా ఎన్నిసార్లు చూస్తారూ. వాడిని కార్టూన్ చూడనివ్వండి" అంది చలపతి భార్య.

వాడు, కార్టూన్ ఒక అరగంట చూసి, మళ్ళీ కేడ్‌బరీస్ మిల్క్ చాక్లెట్లు ఒక నాలుగు కొనిస్తే, యింకాసేపు బయటకు పోతానన్నాడు.

"సరే! అఘోరించు" అని మళ్ళీ అవి తెప్పించి యిచ్చాడు చలపతి.

గబగబా లోపలికి వస్తూ "ఏమండీ చార్మినార్ దగ్గర మత ఘర్షణలు జరుగుతున్నాయట, టీవీలో చూపిస్తున్నారట. ఆ సినిమా ఆపండి బాబూ!" అంది భార్య.

చిన్నప్పట్నించి మతఘర్షణలన్నా, తుఫాన్లన్నా, రైళ్ళుపడిపోవడం అన్నా చాలా యిష్టం చలపతి భార్యకి.

'మనవడు బయటికి వెళ్ళాడనుకుంటే ఈవిడ తగులుకుంది!' అనుకున్నాడు చలపతి.

"ఏమిటో! వచ్చే జన్మలోనైనా ఆడదై పుట్టాలి. అసలు ఈ మగజన్మ ఎత్తినప్పటి నుంచీ, ఏదో ఒక ఆడదానిహయంలోనే కదా మగాడు బ్రతుకుతున్నాడు. చిన్నప్పుడు తల్లి, పెద్దయిన తర్వాత భార్య, ముసలితనంలో కోడలు, మగాడ్ని అణచిపెట్టి 'పురుషాధిక్యం, పురుషాధిక్యం' అంటూంటారు, ఈ మహిళలు.

చలపతికి ఒక జోక్ కూడా జ్ఞాపకం వచ్చింది. ఒకతను అన్నాడట. "నేను ఎక్కువ మాట్లాడను" అని. అదివిన్న రెండోవాడు అన్నాడట "నాక్కూడా పెళ్ళయిందని". సినమా ఆపేసి, టీవీ చూస్తే, "మత ఘర్షణలు జరగలేదనీ, అవన్నీ వదంతులనీ, నమ్మవద్దనీ" పోలీసుశాఖ వారు ప్రకటించారు.

"బ్రతికాంరా! భగవంతుడా, నీవు దయామయుడవు. ఇంక సినిమా చూద్దాం' అనుకునే టైమ్‌కి మళ్ళీ మనవడొచ్చేసాడు.

వాడు మళ్ళీ 'కార్టూన్' అన్నాడు.

"తప్పునాయనా! అస్తమానూ టీవీ చూస్తే కళ్ళుపోతాయి!' అన్నాడు చలపతి.

"మరి నీ కళ్ళు పోవా!" అన్నాడు వాడు.

"పెద్దవాళ్ళని అలా అనకూడదు" అన్నాడు చలపతి.

"మరి పిల్లలు దైవంతో సమానం అంటారు కదా! మా కళ్ళు పోతాయి అనవచ్చా" అన్నాడు వాడు.

'అంత తెలిస్తే యిలా ఎందుకేడుస్తానూ!' అని లోపల అనుకుంటూ, 'తెలియదు బాబూ, కార్టూన్ చూసుకో' అన్నాడు చలపతి.

ఇంతలో, చలపతి మరదలు వచ్చింది. 'ప్రతీ ఆదివారం తయారవుతుంది, ఈవిడ!' అనుకున్నాడు చలపతి.

"ఏమండీ! మా చెల్లెలు వచ్చింది చూసారా! వెళ్ళి పుల్లారెడ్డి స్వీట్లు తీసుకురండి" అంది భార్య.

"సరే తప్పేదేముంది?" అని బయల్దేరాడు.

పొద్దుట్నుంచీ నూట ఏభై దాకా మనవడు చప్పరించేసాడు. ఇప్పుడు, మిగిలింది మరదలు మాయం చేస్తుంది.

తను బయటకు వెళ్తొంటే "లేచింది! లేచింది మహిళాలోకం, దద్దరిల్లింది పురుష ప్రపంచం" అని మెల్లగా పాడుతోంది మరదలు. అదివిని 'మితిమీరిన మంచితనం తప్పు' అనుకున్నాడు చలపతి.

మొత్తం మీద 'గుండమ్మకథ' కుక్కముట్టుకుపోయింది. 'అసలు యింట్లోనే ఉంది ఒక గుండమ్మ! దీని ముందు, ఆ టీవీ గుండమ్మ ఒక లెఖ్ఖా!' అనుకున్నాడు చలపతి.

తర్వాత ఒక ఆదివారం 'మంచి మనసులు' సినిమా టీవిలో చూద్దామనుకున్నాడు చలపతి. ఆ రోజు రోండో కూతురు, తన కొడుకుని తీసుకుని వచ్చి సాయంకాలం దాకా ఉంది. ఈ మనవడికి క్రికెట్పిచ్చి. వాడు మధ్యాహ్నం టెస్ట్మ్యాచ్ చూస్తానని మొదలుపెట్టాడు.

"ఒక దినం మ్యాచ్ అయితే అప్పటికప్పుడు తేలిపోతుంది. ఈ టెస్ట్మ్యాచ్ అయిదు రోజులు పెళ్ళిలాంటిది. ఎప్పుడైనా 'ఒక దినం' మ్యాచ్ చూద్దువుగాని బాబూ!" అని నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు చలపతి.

లోపల్నుంచి వచ్చిన భార్య తగులుకుంది. "ఏమిటండీ! వాడేదో మ్యాచ్ చూస్తానంటే 'దినం దినం' అంటూ తద్దినంలా అన్నీ అశుభాలు పలుకుతారు, నిండింట్లో'! అంది.

"మ్యాచ్ చూడు నాయనా!" అని ఆ రిమోట్ వాడికిచ్చింది.

సాయంకాలం కూతురూ, మనవడు వెళ్ళిన తర్వాత, చలపతి తన భార్యతో అన్నాడు "ఈ రోజైనా తుఫాన్లు రైళ్లు పడిపోవడం వంటివి లేవు కదా, ఒక మంచి సినిమా చూద్దామనుకున్నాను. అసలు 'మంచి మనసులు' సినిమా ఎంత మంచిది, ఏమిటో! దేనికైనా అదృష్టం ఉండాలి".

"తుఫాన్లు అవీ అంటున్నారు నన్నే కదా! చిన్నప్పటినుంచీ నాది జాలిగుండె జనం కష్టపడుతూంటే పట్టించుకోకుండా ఎలా ఉంటాం? అందుకని టివీ చూస్తాను, అయినా అస్తమానూ సినిమా చూస్తూ కూర్చుంటే ఏమొస్తుంది. కొంచెం లోకం పోకడ కూడా తెలుసుకోవాలి గదా!" అని, ఒక రాజకీయ నాయకురాలి ఉపన్యాసం ఫక్కీలో, చెప్పింది.

"పైగా ఏదైనా కోరిక నెరవాలంటే మంచి మనసు కూడా ఉండాలి" అంది.

"ఇదీ వరస! సినిమా చూడనివ్వక పోవడం, పైగా సూటిపోటి మాటలు! అంతా ఖర్మ' అనుకున్నాడు, చలపతి.

ఆ మర్నాడు ఆపీసుకు వెళ్ళి 'యింటిగోడు' తన మిత్రునికి చెప్పాడు చలపతి.

"ఇలా లాభం లేదు. మరొక టి.వి. కొని పడెయ్యి. దెబ్బతో అందరి రోగం వదులుతుంది" అని, వాయిదాల పద్ధతి మీద అదే రోజు సాయంకాలం. ఒక టీవీ యిప్పించాడు మిత్రుడు. ఆ టి.వీ. యింటికి తీసుకువచ్చాడు.

అది చూసి యింట్లో పెద్ద గొడవ అవుతుందనుకున్న చలపతి, 'నేనెప్పట్నుంచో చెపుదామనుకుంటున్నా, ఇంకొక టీవి కొనమని, ఏదైనా అంటారేమో అని చెప్పలేదు. జీవితంలో మొట్టమొదటిసారి ఒక మంచిపని చేసిన ఘనతకొట్టేసారు!" అన్న భార్య మాటలకు ఆశ్చర్యపోయాడు.

"నేను కష్టపడి ఉద్యోగం చేసి, సంపాదిస్తున్నాను. నా కోరికలు తీరేదెప్పుడు?

చూసి, చూసి విసిగిపోయాను. పెద్ద మనవడు వచ్చి కార్టూన్లంటాడు. చిన్న మనవడు వచ్చి క్రికెట్ అంటాడు. నేనెప్పుడు సుఖపడేది. అందుకే ధైర్యం చేసి ఈ టీవీ కొనేశాను" అన్నాడు చలపతి.

"బాగుంది వరస. రెండు టీవీలు ఉంటే, యిద్దరు మనవలూ, వాళ్ళకి యిష్టమైనవి, చెరో చోటా చూస్తారని నేను మెచ్చుకుంటున్నాను. అలా చేద్దాం" అంది హెూమ్ మినిష్టర్.

దేవదాసు సినిమాలో 'అంతా భ్రాంతియేనా' అన్న పాట గుర్తొచ్చింది చలపతికి.

(ఆంధ్రభూమి సచిత్రమాసపత్రిక 3-11-2005)